క్లుప్తంగా

పశువుల యాజమాన్య పద్ధతులు పాటించండి



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనల మేరకు పశు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక పాల ఉత్పత్తి సాధించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 325 గేదెలు, గొర్రెలు, మేకలు, లేగ దూడలు, కోళ్లకు వైద్యపరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులు వేశారు. అవసరమైన వాటికి మందులు, దాణా పంపిణీ చేశారు. సర్పంచి భుక్యా కవిత, పశు సంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య సూచనలు

జి.కొండూరు: మాతా శిశు సంక్షేమం కోసం ఆరోగ్య సూచనలు, సలహాలను ఫోన్ ద్వారా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కిల్కారీ సేవలను ప్రవేశపెట్టిందని ఎన్టీఆర్ జిల్లా కిల్కారీ ప్రోగ్రాం అధికారి రాజు అన్నారు. కిల్కారీ సేవలపై గర్భిణులకు అవగాహన కల్పించేందుకు ఆశ కార్యకర్తలకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణిగా నమోదైన నాటి నుంచి శిశువు జన్మించి సంవత్సర కాలం వచ్చే వరకు ఆ మహిళ ఫోన్ నంబర్‌కు ప్రతి రోజూ ఆరోగ్య సలహాలు, సూచనల సమాచారం అందుతుందని చెప్పారు. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నరాణి, ఆశ నోడల్ అధికారి ఎం. దుర్గారాణి, సీహెచ్‌ఓ అచ్చయ్య పాల్గొన్నారు.

పత్తి సాగుపై అవగాహన

జి.కొండూరు: పాఠశాల దశ నుంచి విద్యార్థులు వ్యవసాయంపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని ఏఓ రాంకుమార్ అన్నా రు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వెలగలేరు చనమోలు పకీరాయుడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు సమీప వ్యవసాయ క్షేత్రాల్లోని పత్తి సాగుపై ఏఓ రాంకుమార్ బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం పత్తిసాగు పద్ధతులపై విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు 9 మందికి నగదు బహుమతి అందజేశారు.

డీఏవీ విద్యార్థినికి ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి దయానంద్ ఆంగ్లో వేదిక్ (డీఏవీ) పాఠశాల ఫస్ట్ క్లాస్ విద్యార్థిని ఉప్పులూరి జోశ్వికఆర్షి ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించింది. గత ఏడాది డిసెంబర్ 2న ఐబీఆర్ ఎచీవర్ సంస్థ ఆధ్వర్యంలో ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, ఆసియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థలు సంయుక్తంగా ఆన్‌లైన్ వేదికగా జరిపిన పోటీలో 60 తెలుగు సంవత్సరాల పేర్లు 29 సెకండ్ల 30 మిల్లీ సెకండ్లలో చెప్పిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్మోహన్ తెలిపారు. ఆయా సంస్థలు బుధవారం పంపించిన రెండు సర్టిఫికెట్లను ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు, డెప్యూటీ కార్యదర్శి పీవీఎస్ఎస్ నాగేశ్వరరావు చిన్నారికి అందజేసి అభినందించారు.

అదనపు డయాలసిస్ యూనిట్ల మంజూరుకు హామీ

తిరువూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కిడ్నీ రోగులకు సరిపడా డయాలసిస్ యూనిట్లను మంజూరు చేస్తామని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పర్వతనేని సుభాష్ బాబు అన్నారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకందుతున్న డయాలసిస్ సేవలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫండ్ నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తిరువూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు శ్యాంసుందర్, కంచర్ల ముత్యప్రసాద్, సంకురాత్రి జనార్దనరావు, రాజేష్‌ఖన్నా, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మరో బాదుడుకు సర్వం సిద్ధం

- భూముల మార్కెట్ విలువ పెంపు
- ఫిబ్రవరి ఒకటి నుంచి పెంపునకు నిర్ణయం
- భారీగా పెరగనున్న భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు
- 10 నుంచి 30 శాతం వరకు పెంపు



నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నూజివీడు: విద్యుత్ బిల్లుల పెంపుతో ఇప్పటికే ప్రజల నడ్డి విరిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా భూముల రిజిస్ట్రేషన్ విలువ చార్జీలను పెంచి ప్రజల నెత్తిన మోయలేని భారాన్ని మోపేందుకు సర్వం సిద్ధం చేసింది. తనను గెలిపిస్తే సంపద సృష్టిస్తానని ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో దగా చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగానే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నూజివీడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో భూముల రిజిస్ట్రేషన్ విలువ చార్జీలు పెరగనున్నాయి. ఇవి ప్రాంతాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న విలువలో 10 నుంచి 30 శాతం వరకు పెరగనున్నాయి. నిర్మాణాలు, భూముల మార్కెట్ విలువను పెంచేందుకు గత నెలలోనే సబ్ రిజిస్ట్రార్లు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కమిటీ ముందు ఉంచారు. వాటిని ఇటీవలనే ఆమోదించారు. పెంచిన భూముల మార్కెట్ విలువలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ప్రజల నెత్తిన భారం మోపుతూ ఆదాయాన్ని పెంచుకోవడం తప్ప ప్రజలకు మేలు కలిగించే పనులు ఒక్కటి కూడా కూటమి ప్రభుత్వం చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పెరగనున్న భూముల ధరలు ఇలా..

నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని నూజివీడు పట్టణంలో ఇప్పుడున్న ప్రభుత్వ ధరపై పది శాతం పెరగనుంది. నూజివీడు మండలంలో మర్రిబంధం నుంచి లీలానగర్ వరకు హైవేపై ఉన్న మీర్జాపురం, గొల్లపల్లి, మొర్సపూడి, తుక్కులూరు, అన్నవరం, వెంకటాద్రిపురం, హనుమంతులగూడెం, మిట్టగూడెం గ్రామాల్లో ఇప్పుడున్న విలువపై 10 శాతం భూముల ధరలు పెరుగుతాయి. మండలంలో మిగిలిన అన్ని గ్రామాల్లో 20 శాతం భూముల ధరలు పెరగనున్నాయి. ముసునూరు మండలంలో అన్ని గ్రామాల్లో 15 శాతం, అవుటర్ రింగ్ రోడ్డు వెళ్లే గ్రామాలైన సగ్గూరు, ఆగిరిపల్లి, జీ కండ్రిక గ్రామాల్లో 10 శాతం పెంచగా, ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేసే అవకాశమున్న పిన్నమరెడ్డిపల్లి, బొద్దనపల్లిలో భూముల విలువ పెంచలేదు. మిగిలిన అన్ని గ్రామాల్లో భూముల విలువను 20 శాతం పెంచారు. బాపులపాడు మండలంలోని కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, సింగన్నగూడెం, మల్లవల్లిలో భూముల విలువ 30 శాతం పెరగనున్నాయి.

ప్రభుత్వ భూములు అవసరమైన చోట 10 శాతమే పెంపు

నూజివీడు మండలం మర్రిబంధం నుంచి లీలానగర్ వరకు నేషనల్ హైవే 216 హెచ్ విస్తరణకు భూములను ప్రభుత్వం సేకరించాల్సి వస్తుందని ఈ మార్గంలో ఉన్న గ్రామాలకు సంబంధించి భూముల విలువను రూ.10 శాతం మాత్రమే ప్రభుత్వం పెంచింది. ఆగిరిపల్లి మండలంలో రాజధాని అవుటర్ రింగ్ రోడ్డు వెళ్లే గ్రామాల్లో 10 శాతం మాత్రమే భూముల విలువను పెంచడం గమనార్హం. ఎక్కువ పెంచితే ప్రజలకు నష్టపరిహారం ఎక్కువ ఇవ్వాల్సి వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం



భూముల మార్కెట్ విలువల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాం. ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి ఉన్న విలువలపై 10 నుంచి 30 శాతం వరకు భూముల ధరలు పెరిగే అవకాశం ఉంది. నూజివీడు పట్టణంలో 10 శాతం పెరిగే అవకాశముండగా గ్రామాల్లో కొన్ని చోట్ల 20 శాతం కూడా పెరగవచ్చు.

– ఎ. రాఘవరావు, సబ్ రిజిస్ట్రార్, నూజివీడు

భూముల లావాదేవీలు తగ్గుతాయి



భూముల మార్కెట్ విలువను పెంచడం వల్ల భూముల కొనుగోలు, అమ్మకాల లావాదేవీలు తగ్గుతాయి. తద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతింటుంది. ఆదాయ మార్గం పెంచుకునేందుకు కొత్త మార్గాలు చూసుకోవాలే తప్ప భూముల ధరలు పెంచడం సరికాదు. మధ్య, దిగువ తరగతి ప్రజలు రానున్న రోజుల్లో భూములు, ఇళ్ల స్థలాలు కొనలేని పరిస్థితి నెలకొంటోంది.

– పరిమి సాగర్ కుమార్, నూజివీడు

ప్రజల భద్రత కోసమే సురక్ష కమిటీలు

సీఐ చంద్రశేఖర్



మూలపాడు(ఇబ్రహీంపట్నం): ప్రజల సామాజిక భద్రత కోసమే సురక్ష కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని సీఐ ఎ.చంద్రశేఖర్ అన్నారు. మూలపాడు ఎస్సీ ఏరియాలో సురక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు గ్రామం విడిచి పొరుగూరు వెళ్లే సమయాల్లో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్ లైన్ మోసాలు, వాట్సాప్ గ్రూపు లింకులపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు నివాస పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులతో సురక్ష కమిటీ ఏర్పాటు చేశారు. ఎస్ఐలు విజయలక్ష్మి, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

1న న్యాయ సేవా శిబిరం

తిరువూరు: తిరువూరులో ఫిబ్రవరి 1న జిల్లా స్థాయిలో న్యాయ సేవా శిబిరం జరుగుతుందని రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి తెలిపారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా జడ్జి, కలెక్టర్ తదితర అధికారులు ఈ శిబిరంలో పాల్గొంటారని, రాజుపేట శ్రీరస్తు కల్యాణ మండపంలో జరిగే న్యాయ సేవా శిబిరంలో రోడ్డు భద్రత, హెల్మెట్ ఆవశ్యకత, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ పెట్రోలింగ్, సైబర్ క్రైం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యం

సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ. సిరి

నూజివీడు: మాతా శిశు మరణాలను తగ్గించడమే కాకుండా గర్భిణులకు సురక్షిత ప్రసవం జరిగేలా నిరంతరం వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ. సిరి అన్నారు. నూజివీడులోని ఏరియా ఆస్పత్రిలో మాతా శిశు మరణాల నివారణ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టు కింద అమలవుతున్న నేపథ్యంలో బుధవారం ఏరియా ఆస్పత్రి వైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాతా శిశు మరణాలను పూర్తిగా తగ్గించేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, వాటిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు జరిగే వరకు వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఏరియా ఆస్పత్రిలోని గైనకాలజీ వైద్యులు గర్భిణులకు నిర్వహించిన వైద్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జాయింట్ డైరెక్టర్ రత్నావళి, ఏలూరు డీఎంహెచ్‌ఓ మాలిని, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేశ్వరరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్, పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలేది బాబు

సీపీఐ ఎంఎల్ నేత హరినాథ్ విమర్శ

నూజివీడు: సూపర్ సిక్స్ హామీలు వాయిదా వేయటానికి లేదా రద్దు చేయడానికి చంద్రబాబు మరో కొత్త నాటకానికి సిద్ధమవుతున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ విమర్శించారు. విదేశీ పర్యటనలతో చంద్రబాబు రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజా సంక్షేమానికి నిధులు లేవని, అప్పులు చేయాల్సి వస్తోందని మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. విజన్ 2047 పేరుతో గొప్పలు చెప్పడం, వడ్డీల రూపంలో పన్నుల భారాలు మోపుతానని పరోక్షంగా చెప్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేసేందుకు ప్రత్యేక నిధులు, గ్రాంట్లు ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు అప్పుల రూపంలో తెచ్చుకునేందుకు చంద్రబాబు పచ్చ జెండా ఊపటం రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా చేయటానికేనని విమర్శించారు. వామపక్ష ప్రజాస్వామ్య శక్తులు రాష్ట్రంలో తృతీయ ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని హరినాథ్ విజ్ఞప్తి చేశారు.

● పొంచి ఉన్న ప్రమాదం



గొల్లపూడి శివారు ప్రాంతంలోని నేషనల్ హైవేపై కంకర రాళ్లు రోడ్డుపై ప్రమాదకరంగా పడి ఉన్నాయి. వాహనదారులు చూసుకోకుండా వాటిపై వెళ్లే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. తక్షణమే అధికారులు స్పందించి రాళ్లను తొలగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– కె.చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

ప్రభుత్వ పాఠశాలకు విరాళాలు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు పలువురు దాతలు బుధవారం విరాళాలిచ్చారు. నాళ్ళా సాయిప్రసాద్, దారా మురళీకృష్ణ, డాక్టర్ బాలాజీలు రూ.5 వేల చొప్పున పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరావుకు అందజేశారు. సైకిల్ స్టాండు నిర్మాణాన్ని దాతల సహకారంతో పూర్తి చేస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

చాట్రాయి: మొక్కజొన్న సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. ఆరుగొలనుపేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల పంటకు అవసరమైన మిత్ర పురుగులు చనిపోతాయని, భూసారం తగ్గుతుందని, తద్వారా దిగుబడి తగ్గుతుందని చెప్పారు. నేలలో సేంద్రియ కర్బనం ఎక్కువగా పెరగడానికి సహజ ఎరువులైన ఆవు పేడ, మూత్రంతో తయారు చేసిన కషాయాలు, ఘన జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం ద్రావణాలను స్ప్రే చేయాలని ఆయన సూచించారు. అనంతరం జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల వివరాలు ఈ–క్రాప్‌లో నమోదు

ముసునూరు: రైతులంతా తమ పంటలను తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చినసూరిబాబు అన్నారు. గుళ్లపూడి, వలసపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తాను వేసిన పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. పంటల బీమా పథకానికి ప్రీమియం చెల్లించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ, పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం పశువైద్యాధికారి ఎం.వెంకట చైతన్య పశుసంవర్ధక శాఖ ద్వారా పశు పోషకులు, పాడి రైతులకు లభించే పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ నాయక్, వీహెచ్‌ఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గానుగపాడులో..

గానుగపాడు(తిరువూరురూరల్): గానుగపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో ఆకుముడత ఆశించినప్పుడు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు ఏఓ పద్మ వివరించారు. గొంగళి పురుగు ఆకు ముడతలో ఉండి పత్ర హరితాన్ని గోకి తినడం వల్ల ఆకులు తెల్లబడతాయన్నారు. వరి సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలను వివరించారు.

సంక్షిప్తంగా...

● పందిరి కూరగాయల సాగు లాభదాయకం

ముసునూరు: పందిరి కూరగాయ పంటల సాగు లాభదాయకమని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్. రామ్మోహన్ అన్నారు. మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక ఆధ్వర్యంలో అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, వేల్పుచర్ల, చిల్లబోయినపల్లిలో సాగవుతున్న కూరగాయలు, మిర్చి, ఆయిల్ పామ్ పంటలను రైతులు, సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూరగాయల పంటలపై జాగ్రత్తలు, మిర్చి సాగులో నల్ల తామర ఉధృతిపై తక్షణ సస్య రక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. నల్ల తామర వంటి తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధన, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన తక్షణ సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

● ఆలయాన్ని తెరిపించాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఖిల్లా సమీపంలో దూరదర్శన్ రిలే కేంద్రం వద్ద ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని తెరిపించాలని కూటమి నాయకులు జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు విన్నవించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● కాలనీలో నెల రోజులుగా నీటికి ఇబ్బందులు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): పల్లె పండుగ పేరుతో కొత్తూరు తాడేపల్లి శివారు వేమవరం కాలనీలో సుమారు నెల కిందట రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఉపాధి నిధులు సుమారు రూ. 52 లక్షలతో నాలుగు సిమెంటు రోడ్లు నిర్మించారు. ఆ సమయంలో కాలనీలోని నీటి పైపు లైన్‌ను తొలగించారు. రోడ్లు ఎంత అవసరమో నీరు కూడా అంతే అవసరం కదా, రోడ్లు నిర్మించే వరకు నీటి కోసం స్థానికులు ఇబ్బంది పడక తప్పదని పాలకులు నచ్చ చెప్పి పనులు ప్రారంభించారు. పైప్ లైన్ తొలగింపుతో సుమారు నెల రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. కాలనీ వాసులు సమీపంలోని బోరు పంపు నుంచి నీరు తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పైప్ లైన్ నిర్మించి నీటి ఇబ్బందులు తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. దీనిపై ఇంజినీరింగ్ సహాయకులు సాయిని వివరణ కోరగా జీఏ పైపు లైను అందుబాటులో ఉందని, ఫిట్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

● 1న షాపులకు వేలం

మైలవరం: బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవాలయానికి చెందిన షాపుల వేలం ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. తేజ తెలిపారు. పూజా ద్రవ్యాలు, ఆట వస్తువులు, ఫ్యాన్సీ తదితర వ్యాపారాలు చేసుకునే అనుమతుల హక్కులకు, భక్తులచే సమర్పించు వస్త్రాలు, పాలు, బియ్యం, అపరాలు, తలనీలాలు పోగుచేసుకునే లైసెన్స్ హక్కునకు ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేలం జరుగుతుందని చెప్పారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

● సీనియర్ జర్నలిస్టులకు సన్మానం

ఇబ్రహీంపట్నం: భారతీయ వార్తా పత్రికల దినోత్సవ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీడీఓ సునీతశర్మ పలువురు సీనియర్ జర్నలిస్టులను శాలువాతో సత్కరించారు. కేతనకొండ, జూపూడి, చిలుకూరు గ్రామాల సర్పంచులు నెలకుర్తి నళినీ ఆశాలత, కాకి దేవమాత, గొంది సురేష్, ఎంపీటీసీలు ఉప్పులూరి నాగేశ్వరరావు, పులి సువర్ణరాజు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

● సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చింతలపాడు(తిరువూరురూరల్): సైబర్ నేరాలపై మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తిరువూరు సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని చింతలపాడులో బుధవారం సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లలో పెట్టుబడులు పెడితే అధిక ఆదాయం వస్తుందని ఆశపడి మోసపోవద్దన్నారు. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.

● రేపు ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆత్మీయ సమావేశం

మైలవరం: ప్రస్తుత శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు ఈ నెల 31 సాయంత్రం 5 గంటలకు మైలవరంలోని పెన్షనర్ల విశ్రాంతి భవనంలో జరిగే ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో జరుగనున్న కృష్ణా, గుంటూరు శాసన మండలి ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తారని, వీరిని బలపరుస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, నిరుద్యోగ, పెన్షనర్లతో ఈ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థుల కోసం లక్ష్మణరావుచే సైకాలజీ క్లాస్ ఏర్పాటు చేశామన్నారు. శిక్షణా తరగతికి హాజరైన అభ్యర్థులకు లక్ష్మణరావు రచించిన సైకాలజీ పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తారని చెప్పారు.

● సబ్సిడీపై సోలార్ విద్యుత్ యూనిట్లు

చాట్రాయి: సబ్సిడీపై అందించే సోలార్ విద్యుత్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సిబ్బందికి సబ్సిడీపై అందించే సోలార్ విద్యుత్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వెలుగు సిబ్బంది ఆయా గ్రామాల్లో సబ్సిడీపై అందించే సోలార్ విద్యుత్ యూనిట్లపై ప్రచారం చేసి రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. ఎంపీడీఓ విజయ లక్ష్మి, మండల పరిషత్ సూపరింటెండెంట్ కమల విష్ణు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● పందెం రాయుళ్ల అరెస్ట్

జి.కొండూరు: మండల పరిధి గుర్రాజుపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై జి.కొండూరు పోలీసులు బుధవారం మధ్యాహ్నం దాడి చేశారు. పందేలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మూడు ద్విచక్ర వాహనాలు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.90,700 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

● అంకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

తిరువూరు: స్థానిక రాజుపేట బస్టాండ్ సెంటర్ వడ్డెర బజారులో నూతనంగా నిర్మించిన అంకమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజతో ప్రారంభమైన ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 30న అంకమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలను పట్టణంలో ఊరేగించిన అనంతరం 31న ప్రతిష్ఠ జరుపుతారు. అనంతరం అన్నదానం చేస్తారు.

● 360 మందికి వైద్య పరీక్షలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): కాలుష్య ప్రభావిత గ్రామాల్లో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎన్టీటీపీఎస్ సంస్థ అధికారులకు సూచించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో తుమ్మలపాలెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ వైద్యశాలలకు చెందిన వైద్యులు 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామ సర్పంచి బొమ్ము వెంకటరమణ, ఎంపీటీసీ పాలిశెట్టి తేజ, గ్రామ కార్యదర్శి సరోజాబాయి పాల్గొన్నారు.

● 7న నూజివీడులో బాలోత్సవం

నూజివీడు: బాలోత్సవం కార్యక్రమం నూజివీడులో ఫిబ్రవరి 7వ తేదీ జరుగుతుందని బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కాసాని గాంగేయుడు తెలిపారు. బాలోత్సవం కార్యక్రమానికి సంబంధించి ప్రచార గీతాన్ని బుధవారం పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొనవచ్చన్నారు. హేలాపురి బాలోత్సవం సమన్వయ కార్యదర్శి జి. నరసింహారావు, ఎస్ఆర్ హనుమాన్లు, యూవీ రామరాజు, షేక్ సుభాని, సభ్యులు పాల్గొన్నారు.

● సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

తిరువూరు: సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరుగుతాయని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు వీఆర్ కాలేజీ స్టేడియంలో జరుగనున్న బహిరంగ సభలో తిరువూరు ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు. నాయకులు లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, భద్రం, వెంకటేశ్వరరావు, రవి, నాగుల్‌మీరా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● రీ–సర్వే పరిశీలన

ముసునూరు: రీ సర్వేను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్వామిత్వ సర్వే, భూ హక్కు–భూ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా అక్కిరెడ్డిగూడెంను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, బుధవారం నుంచి రీ–సర్వే నిర్వహణ ప్రారంభించామని తహసీల్దార్ చెప్పారు. ప్రభుత్వ భూముల గుర్తింపు, హద్దుల నిర్ణయం తదితర అంశాలను పరిశీలించామన్నారు.

● నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సాయిపురం కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి. రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట కాలువ రోడ్డు, విజేత సూపర్ మార్కెట్, అనిల్ కాస్టిల్ అపార్ట్‌మెంట్, నెస్ట్‌జన్ స్కూల్, రామస్వామి హోటల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.